సాక్షి
మెదక్
గురువారం । 21 । డిసెంబర్ । 2023



తమ్ముడిని హత్య చేసిన అన్న

తమ్ముడిని అన్న దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణం చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేటలో చోటు చేసుకుంది.

వివరాలు 8లో ▸



వైద్యుల నిర్లక్ష్యంతోనే..

వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతోనే బాబు మృతి చెందాడని తండావాసులు ఆందోళన చేశారు.

వివరాలు 8లో ▸



అద్భుతం.. 3డీ ప్రింటెడ్ ఆలయం

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో శ్రీపాద కార్యసిద్ధేశ్వరస్వామి దేవాలయాన్ని సిద్దిపేటలో నిర్మించారు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

స్టేజీ వద్ద ఆగని బస్సు!

అల్లాదుర్గం(మెదక్): మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోంది. గ్రామాల స్టేజీల వద్ద వారు ఉంటే ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో అల్లాదుర్గం బస్సు స్టేజీ వద్ద ఇద్దరు మహిళలు వేచియున్నారు. పెద్దశంకరంపేట నుంచి సంగారెడ్డి వైపునకు ఆర్టీసీ బస్సు వెళ్తుంది. మహిళలు ఆపాలని చేయి ఎత్తినా డ్రైవర్ ఆపకుండానే వెళ్లిపోయాడు. ఉచితం ప్రయాణం కావడంతో బస్సు ఆపలేదని, ఆర్టీసీ అధికారులు ఈ రూట్‌ను పర్యవేక్షించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు సన్మానం



కిషోర్, హరిచందనను సన్మానిస్తున్న పురపాలక ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

నర్సాపూర్: మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పురపాలక సంచాలకులు హరిచందన దాసరిని మున్సిపాలిటీ ఉద్యోగుల రాష్ట్ర సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం వారిద్దరికి రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్, నర్సాపూర్ కమిషనర్ వెంకటగోపాల్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కాగా, వీరిద్దరూ వారి బాధ్యతలు చేపట్టారు.

శివ్వంపేట, బిజ్లిపూర్‌లో పైలెట్ ప్రాజెక్టు

ఇంటింటా రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలను పరీక్షిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు గాను రక్త నమూనాలను సేకరిస్తున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఇంటింటా సర్వే పైలెట్ ప్రాజెక్టులో భాగంగా శివ్వంపేట, బిజ్లిపూర్ గ్రామాల్లో సిబ్బంది పర్యటిస్తున్నారు. కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న అనంతరం ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రతి ఇంటికీ వెళ్లి రక్త నమూనాలు తీసుకుంటున్నట్లు ల్యాబ్ కోఆర్డినేటర్ జయప్రకాష్ తెలిపారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ శాతాన్ని తెలుసుకుంటున్నామని, అందుకు సంబంధించి రిపోర్టులు సదరు బాధ్యుతలకే ఇస్తున్నామని చెప్పారు. రోజుకు 30 కుటుంబాల రక్త నమూనాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ విద్యార్థినీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ఈనెల 31వ దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ సెంటర్ ద్వారా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: లోక్‌అదాలత్‌లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో అదాలత్ నిర్వహించారు. ఈనెల 18 నుంచి 29 వరకు రోజూ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి జితేందర్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

నార్సింగి పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్‌పై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసు అందజేశారు. మెదక్ జిల్లా సహకార శాఖ అధికారి కరుణకు తీర్మాన నోటీసు అందజేశారు. తీర్మాన ప్రతిపై ఎనిమిది మంది డైరెక్టర్లు సంతకాలు చేశారు. చైర్మన్ శంకర్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్లు బీఆర్ఎస్ నాయకులు అయినప్పటికీ అవిశ్వాసం ప్రతిపాదించడం చర్చనీయాంశంగా మారింది.

‘నైపుణ్యాని’కి నిధులేవీ?

- రెండేళ్లుగా విడుదల కానీ నిధులు
- నీరుగారుతున్న ఈడబ్ల్యూఆర్‌సీ

యువత జీవితంలో స్థిరపడాలని లక్ష్యంతో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈడబ్ల్యూఆర్‌సీ, ఉన్నతి పథకాలు ప్రవేశపెట్టారు. యువత భవితపై ఈ పథకాలు ఎన్నో ఆశలు కల్పించాయి. నైపుణ్యం గడించిన యువత వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ఫలితంగా వారి జీవితాలు బంగారు బాటలు పడుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత పొందిన పథకానికి రెండేళ్లుగా నిధులు నిలిచిపోయాయి. ఉన్నతి మాత్రం కొనసాగుతోంది.



కాడిపల్లి కృషివిజ్ఞాన కేంద్రంలో సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన

మెదక్: గ్రామీణ ప్రాంత యువతకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు 2017లో ఇంగ్లిష్ వర్క్ రెడీనెస్ కోర్స్ (ఈడబ్ల్యూఆర్‌సీ) పథకం ప్రారంభమైంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఒక ప్రభుత్వ భవనంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్నవారు అర్హులు. అంతేకాకుండా ఉపాధి లేని నిరుద్యోగ యువత, ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న వారి పిల్లలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పథకం నాలుగుఏళ్లపాటు సవ్యంగా సాగింది. ఈ సమయంలో 9 బ్యాచ్‌ల ద్వారా 195 మందికి వివిధ రంగాల్లో శిక్షణ పొందారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ తీసుకున్నారు. అందులో 166 మంది వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

అలాగే డీఆర్‌డీఏ(గ్రామీణ అభివృద్ధి సంస్థ) 2019లో ఉన్నతి పేరిట నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. మెదక్ జిల్లా కొడిపల్లి మండల పరిధిలోని కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే)లో జిల్లా రైతాంగానికి సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. జిల్లాలోని అన్ని మండల పరిధిలో ఉన్న 520 మంది రైతులను గుర్తించి ఈ శిక్షణ ఇచ్చింది. వారిని బ్యాచ్‌లుగా చేసి వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా సేంద్రియ సాగు, వర్మీకంపోస్టు ఎరువుల తయారీ, రసాయన ఎరువులతో కలిగే నష్టాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆ సమయంలో రైతులకు ఈజీఎస్ కింద కూలి డబ్బులను వారి ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 463 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ పథకం మాత్రం సవ్యంగా కొనసాగుతోంది.

రెండేళ్లుగా నిధులు లేవు

ఈడబ్ల్యూఆర్‌సీ పథకానికి రెండేళ్లుగా నిధులు విడుదల కావడం లేదు. నిధులు విడుదల కాకపోవడంతో గ్రామీణ యువత చేసేది లేక కూలీ పనులకే పరిమితం అవుతున్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ పథకానికి నిధులు మంజూరు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అలాగే శిక్షణ ఇచ్చే సమయంలో ఆయా రంగాలకు సంబంధించిన పనిముట్లు, భోజన, వసతి అన్ని సౌకర్యాల కల్పన కోసం నిధులు విడుదల అయ్యేవని చెబుతున్నారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



నాలుగేళ్లుగా కొడిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ సాగుపై రైతులకు శిక్షణ ఇప్పిస్తున్నాం. ఈ సమయంలో ఉపాధి పథకం ద్వారా కూలిని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఇది అన్నదాతలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం అనేక మార్పులు చేస్తోంది.

– శ్రీనివాస్, డీఆర్‌డీఓ

అప్పుల పాలయ్యాం

వేతనాలు ఇప్పించాలని వీఆర్‌ఏల వినతి



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న వీఆర్‌ఏలు

మెదక్‌కలెక్టరేట్: తమకు రావాల్సిన 5 నెలల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని వీఆర్‌ఏలు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం వీఆర్‌ఏలకు రెగ్యులరైజ్ చేసి ఐదు నెలలు గడుస్తున్నా నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇప్పటివరకు గడిచిన ఈ నెలలకు గాను ఎలాంటి జీతభత్యాలు ఇవ్వకపోవడంతో అప్పుల పాలయ్యామని వాపోయారు. మానసికంగా, ఆర్థికంగా కుటుంబాలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం తక్షణమే పోస్టింగ్ ఆర్డర్, జీతాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు లక్ష్మణ్, నాగరాజు, రాజు, శివకుమార్, బాబు, కిరణ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

మెదక్: అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని అడిషనల్ కలెక్టర్ రమేష్ తెలిపారు. స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో బుధవారం డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ అండర్14,16 మీట్ జరిగింది. ఈ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఇందులో 400 మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అబ్జర్వర్ అనిల్, సుదర్శనమూర్తి , రమేష్, ఎస్జీఎఫ్ సెక్రటరీ నాగరాజు, టీఎస్ ప్రెసిడెంట్, మెదక్ డిస్టిక్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్లతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితా తయారు చేయాలని, ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటర్ల జాబితా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్ఓ పద్మశ్రీ, ఆర్డీఓ రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాకు ఉపాధి కల్పించండి



రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

- ఆటో డ్రైవర్ల నివేదన
- పట్టణంలో ర్యాలీ, చౌరస్తాలో రాస్తారోకో

నర్సాపూర్: తమకు ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్‌తో బుధవారం ఆటో డ్రైవర్లు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం నుంచి ప్రారంభమై పట్టణంలోని పలు వీధుల గుండా తిరిగి చౌరస్తా వద్దకు చేరుకుంది. ఇక్కడే రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల తమ బతుకులు ఛిద్రమవుతున్నాయన్నారు. రాస్తారోకోలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు ఆంజనేయులు, భిక్షపతి, నాగభూషణం, రాజు, కుమార్, లక్ష్మణ్‌గౌడ్, ఖదీర్, సత్యనారాయణ, రాములు, మహేష్, మునీర్, రామాగౌడ్, సలీం పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి

జెడ్పీ సీఈవో శైలేష్

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ అధికారిక ఆహ్వానాల్లో నిబంధనలు పాటించాలని జెడ్పీ సీఈవో శైలేష్ బుధవారం తెలిపారు. వివిధ కార్పొరేషన్ సంస్థల అధ్యక్షులు, చైర్మన్ల పోస్టులను ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వారికి సమాచారం, ఆహ్వానాలు నిలిపేయాలని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ నిబంధనల మేరకు మండల ప్రజా పరిషత్ అధికారులకు ఆదేశాలను జారీ చేశామని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఆధారంగా ఆహ్వానాలు పంపాలని అధికారులకు సూచించారు.

28 నుంచి స్థాయీ సంఘ సమావేశాలు

ఈనెల 28, 29వ తేదీల్లో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ శైలేష్ బుధవారం తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

ఆత్మ రక్షణకు కరాటే దోహదం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు తదితరులు

కొడిపల్లి(నర్సాపూర్): ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని కరాటే ఎక్జామినర్, ఫిజికల్ డైరెక్టర్ ప్రతాప్‌సింగ్ తెలిపారు. బుధవారం కొడిపల్లిలో ఉన్నత పాఠశాలలో కొల్చారం, కొడిపల్లి మండలాలకు చెందిన పలువురు విద్యార్థులకు కరాటే పోటీలు (బెల్ట్ టెస్ట్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం కరాటే శిక్షణ ఇప్పిస్తోందని చెప్పారు. ఇది నేర్చుకోవడం వల్ల శరీర దృఢంగా తయారవుతోందన్నారు. ఆరోగ్యం సైతం బాగుంటోందన్నారు. ప్రత్యేకంగా బాలికలకు ఇది ఎంతో ఉపయోగమన్నారు. తొలుత 50 మందికి ఈ పోటీలను నిర్వహించి అందులో ప్రతిభ చూపిన వారికి కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధాక్రిష్ణ, పీడీ రమేష్, కరాటే మాస్టర్లు నగేష్, సంతోష్, మల్లేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘కార్యకర్తలకు అండ ఉంటా’



చిన్నఘనాపూర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం, బలగమని, వారికి పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి భరోసానిచ్చారు. బుధవారం మండలంలోని చిన్నఘనాపూర్, సంగాయిపేట గ్రామాల్లో కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పీసీసీ రాష్ట్ర నాయకుడు రవీందర్ రెడ్డితో కలిసి ఆయన పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ, నర్సాపూర్‌లో పార్టీ ఓడినా నైతికంగా ప్రజలు, కార్యకర్తల అండతో బీఆర్ఎస్‌కు గట్టి సవాలు విసిరిందన్నారు. ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కనుమరుగవుతుందన్నారు. ముందుగా చిన్నఘనాపూర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, చిన్నఘనాపూర్ పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగయ్య పాల్గొన్నారు.

నాలా కన్వర్షన్ తప్పనిసరి


జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి కరుణాకర్



కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న కరుణాకర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో లేఅవుట్‌లు, ఇంటి నిర్మాణాలు, ఇండస్ట్రీ నిర్మాణాలకు నిబంధనల ప్రకారమే అనుమతులు ఇవ్వాలని జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి కరుణాకర్ అన్నారు. మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన లేఅవుట్‌లు, ఇంటి నిర్మాణాలు తదితర వాటి అనుమతులపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేఅవుట్‌కు అనుమతి ఇచ్చే ముందు తప్పనిసరిగా నాలా కన్వర్షన్‌తోపాటు డీటీసీపీ అనుమతి ఉండాలన్నారు. బిల్డింగ్ నిర్మాణాలకు సరైన పత్రాలు ఉంటేనే పర్మిషన్ ఇవ్వాలని చెప్పారు. పట్టా భూముల్లో ఇంటి నిర్మాణాలకు నాలా కన్వర్షన్ తప్పనిసరి అని సూచించారు. గ్రామ కంఠంలో గృహ నిర్మాణాలకు ఇంటి పన్ను, గ్రామంలో నివాసం ఉన్న సంవత్సరాలను సర్పంచ్, పాలకవర్గం, గ్రామ పెద్దల సమక్షంలో పంచనామా చేసి అనుమతి ఇవ్వాలన్నారు. ఇండస్ట్రీలకు టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతి ఇవ్వాలన్నారు. అసైన్డ్ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశిప్రభ, ఎంపీఓ రమేష్, డీటీసీపీ అసిస్టెంట్ అమర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఏ కేస్ స్టడీ ఇన్ గజ్వేల్’ పరిశోధనకు గుర్తింపు



అధ్యాపకురాలు లావణ్య

గజ్వేల్‌రూరల్: ‘ఏ కేస్ స్టడీ ఇన్ గజ్వేల్’ అనే ప్రాజెక్టు ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపికైంది. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మైక్రో బయోలజీ అధ్యాపకురాలు తుమ్మ లావణ్య, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహాకౌషల్ సంయుక్తంగా అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ - ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈనేపథ్యంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ వ్యవసాయంలో మహిళా సాధికారత ప్రభావంపై రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమ పరిశోధనా పత్రానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో వీరు పాల్గొన్నారన్నారు. ఇండియా-థాయిలాండ్, బ్యాంకాక్ దేశాల నుంచి 109 మంది పాల్గొన్న ఈ అంతర్జాతీయ సదస్సులో తమ కళాశాలకు చెందిన లావణ్య రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమ పరిశోధనా పత్రంగా ఎంపికవడం హర్షణీయమన్నారు.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్టు : ఇన్‌చార్జి సీపీ

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని కరీంనగర్ సీపీ, సిద్దిపేట ఇన్‌చార్జి సీపీ అభిషేక్ మహంతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. ఈ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని సూచించారు.

అలంకారప్రాయంగా ఆక్సిజన్ ప్లాంట్

- సిలిండర్లను బయట కొనుగోలు చేస్తున్న ఆస్పత్రి
- పరికరాలు తుప్పపట్టే అవకాశం ఉందంటున్న నిపుణులు



నిరుపయోగంగా యంత్రాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న ఆక్సిజన్ ప్లాంటు

నర్సాపూర్: ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్ అలంకారప్రాయంగా మారింది. నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏడాదిన్నర క్రితం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. అప్పుడు 50 లక్షల రూపాయలు వెచ్చించారు. ఈ ప్లాంటు ఏర్పాటు చేశారే గానీ అందుకు అవసరమైన కరెంటు సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఆస్పత్రిలో 163 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా చేసి కరెంటు సరఫరా చేస్తున్నారు. ఇది ఆస్పత్రి అవసరాలకు సరిపోతుంది. అదే ఆక్సిజన్ ప్లాంటు పని చేయాలంటే 63 కేవీ సామర్థ్యం గల ఒక ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉంది. ఇప్పుడు ఈ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలి అలాగే కరెంట్ సరఫరా కోసం కనెక్షన్ సైతం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రెండు అమలుకు నోచలేదు. దీంతో ఆస్పత్రికి అవసరమైన ఆక్సిజన్‌ను మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి

యంత్రాలు, పలు రకాల పరికరాలను చాలా కాలం పాటు ఉపయోగించని పక్షంలో తుప్పుపడతాయని ఆయా రంగాల నిపుణులు అంటున్నారు. వాటిని ఇంత వరకు వినియోగంలోకి తేనందునా అందులో ఏర్పాటు చేసిన యంత్రాలు, ఇతర పరికరాలు పాడయ్యే ప్రమాదం ఉండటంతో వాటిని వీలైనంత త్వరలో వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారులకు లేఖ రాశా

ఆక్సిజన్ ప్లాంట్‌కు కరెంటు సరఫరా నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఇటీవల తమ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాశా. ప్లాంట్‌కు త్వరలోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తామని, కరెంటు కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తెస్తామని అధికారులు నాతో చెప్పారు.

– డాక్టర్ పావని, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



జగదీశ్‌తో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, పీడీ వెంకట్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని లింగరాజుపల్లి ఎంజేపీ బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా పీడీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 10వ తరగతి చదువుతున్న విద్యార్థి జగదీశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్–17 విభాగంలో హాకీ పోటీల్లో ప్రతిభచాటి జాతీయ స్థాయికి ఎంపికవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు ఎంపిక



ఆగస్టీన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) సిద్దిపేటలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఆగస్టిన్ జాతీయ స్థాయిలో నిర్వహించే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి జనవరి 1 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే నేషనల్ అడ్వెంచర్ క్యాంపునకు హాజరు కానున్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు మధుసూదన్, కృష్ణయ్య ఆగస్టీన్‌కు అభినందనలు తెలిపారు. క్యాంప్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొననున్నట్లు ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు..



రజనీ, వైష్ణవి

గజ్వేల్‌రూరల్: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రత్యేకాధికారి అనురాధ, పీఈటీ జ్యోతి పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో గల కేజీబీవీలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఎం.రజని, వీ.వైష్ణవి అక్టోబర్‌లో మేడ్చల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి 24 తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే 29వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలోనూ రాణించి, పాఠశాలకు పేరు తీసు కురావాలని ఆకాంక్షిస్తూ.. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

అద్భుతం.. 3డీ ప్రింటెడ్ ఆలయం

30 రోజులు.. 30 గంటల్లో నిర్మాణం

- దేశంలోనే మొదటిదిగా సిద్దిపేట శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయం ఘనత
- ఇటీవలె ప్రారంభం.. నిత్యం విశేష పూజలు
- మోదక్ ఆకారం గుడిలో హేరంబ గణపతి
- దీర్ఘచతురస్రాకార గుడిలో దత్తాత్రేయ స్వామితోపాటు స్పటికలింగం
- నిర్మాణాన్ని పరిశీలిస్తున్న యువ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలు



సిద్దిపేటలోని శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయం

సాక్షి, సిద్దిపేట : ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ఎంతో వ్యయ ప్రయాసాలు తప్పవు.. సామగ్రి, కూలీలు అన్నీ ఇన్నీ కావు.. ఒకవేళ అందుబాటులో ఉన్నా నిర్మాణం పూర్తి కావాలంటే నెలలు గడవాల్సిందే. ఈ కష్టాలన్నింటికీ చెక్ పెడుతూ .. స్వల్ప వ్యవధిలోనే నిర్మాణాలు పూర్తి చేసే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. దేశంలోనే మొట్టమొదటి త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ (రోబో)తో ఆధ్యాత్మిక శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయాన్ని సిద్దిపేటలోని బూరుగుపల్లి సమీపంలో నిర్మించారు. నెలరోజులపాటు 3డీ ప్రిటింగ్‌తో 30 గంటల్లో దేవాలయ నిర్మాణం పూర్తి చేసి ఔరా అనిపించారు. ఈ త్రీడీ దేవాలయాన్ని 3,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 30 అడుగుల ఎత్తులో నిర్మించారు.



దేశంలోనే తొలి దేవాలయం

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ(రోబో) మిషన్‌ను ఏబీబీ అనే యూరోపియన్ నుంచి తీసుకొచ్చారు. దీనిలో ఉండే ఇంటర్నల్ సిస్టమ్, దీని కోసం వినియోగించే సాఫ్ట్‌వేర్‌ను భారతదేశంలోనే తయారు చేశారు. ప్రపంచంలోనే తొలిసారిగా 2022లో 3డీ ప్రిటింగ్ విధానంలో కాలిఫోర్నియాలోని టిహమా కౌంటీలో చర్చి నిర్మించారు. సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ ఈ ఏడాది మార్చిలో ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి దేశంలోనే తొలి త్రీడీ ప్రింటెడ్ నమూనా వంతెనను నిర్మించింది. దేశంలోనే తొలిసారిగా మిషనరీతో సిద్దిపేటలో దేవాలయం నిర్మించారు.

ఇటీవల ప్రారంభం

సిద్దిపేటలో త్రీడీ టెక్నాలజీతో నిర్మించిన శ్రీపాద కార్యసిద్దేశ్వరస్వామి దేవాలయం ఇటీవల ప్రారంభించారు. వారం రోజులపాటు విగ్రహప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించారు. నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు దేవాలయం నిర్మించిన తీరును అడిగి తెలుసుకుంటున్నారు. త్వరగా నిర్మాణం పూర్తికావడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం ఇంజినీర్లు, పలు నిర్మాణ సంస్థలు వచ్చి నిర్మాణంను పరిశీలిస్తున్నారు.



ఒక్కో గర్భగుడికి ఒక్కో ప్రత్యేకత

దేవాయలంలో గర్భగుడీలు ఒక్కొక్కటి ఒక్కో ఆకారంలో నిర్మించారు. హేరంబ గణపతి కోసం మోదకం ఆకారంలో గర్భగుడిని నిర్మించారు. ఇది 11 ఫీట్ల ఎత్తు, 8 ఫీట్ల వెడల్పు ఉంది. వీటి నిర్మాణం వారం రోజులపాటు 7 గంటలు ప్రింటింగ్‌తో నిర్మాణం పూర్తి చేశారు. అలాగే భువనేశ్వరి అమ్మవారి కోసం కమలం మొగ్గ ఆకారంలో గర్భగుడిని నిర్మించారు. ఎత్తు 11 ఫీట్లు , వెడల్పు 8.5 ఫీట్లు ఉంది. ఈ ఆకారం నిర్మాణం కోసం వారం రోజులపాటు ప్రింటింగ్ 8 గంటలు పట్టింది. దత్తాత్రేయ స్వామితోపాటు స్పటికలింగానికి గర్భగుడి దీర్ఘచతురస్రాకారంలో నిర్మించారు. 10 రోజులపాటు 15 నుంచి 16 గంటల సమయం పట్టింది.



కంప్యూటర్‌లో రూపొందించి

కంప్యూటర్‌లో ముందుగా దేవాలయం డిజైన్ పొందుపర్చి కాంక్రీట్ త్రీడీ మిషన్ ద్వారా నిర్మించారు. అప్సూజ కంపెనీ నిర్మాణ బాధ్యతలను తీసుకొని సింప్లీ పోర్జ్ అనే త్రీడీ టెక్నాలజీ కంపెనీకి అప్పగించింది. మోదక్, దీర్ఘచతురస్రాకారం, కమలం మొగ్గ ఆకారాల్లోని గర్భ గుడీలతోపాటు ఆలయ గోపురాలను కంప్యూటర్‌లో తొలుత 3డీలో డిజైన్ చేసి ఆపై యంత్రాల ద్వారా నిర్మించారు. దీంతో ఆలయం భక్తులకు కనువిందు చేస్తోంది.

కూలీల పని తప్పింది



3డీ ప్రింటింగ్ టెక్నాలజీ(రోబో) మిషన్‌ను ఏబీబీ అనే యూరోపియన్ నుంచి తీసుకొచ్చాం. దీనికి సంబంధించి మొత్తం సాఫ్ట్‌వేర్‌ను మన దేశంలోనే తయారు చేసి నిర్మాణం చేపట్టాం. కూలీల వ్యయప్రయాసలు తప్పాయి.

– హరికృష్ణ, సీఈఓ

తమ్ముడిని హత్య చేసిన అన్న

- భూ పంపిణీలో భాగంగా వివాదం
- మృతుడు శాలిపేట గ్రామ ఉపసర్పంచ్

చిన్నశంకరంపేట(మెదక్): ఒకే కడుపున పుట్టిన తమ్ముడిని అన్న దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణం చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శాలిపేట గ్రామానికి చెందిన ముంద్రాతి ఆంజనేయులు (35), సత్యనారాయణ, సిద్దిరాములు ముగ్గురూ అన్నాదమ్ముళ్లు. వీరు ఇప్పటికే తల్లిదండ్రుల ఆస్తి పంచుకున్నారు. ఇందులో సత్యనారాయణకు చెరువు సమీపంలో ఐదెకరాలు రాగా, ఆంజనేయులుకు పోచమ్మ మర్రిచెట్టు సమీపంలో ఐదెకరాలు వచ్చింది. సత్యనారాయణ పొలం వద్ద నీళ్లు సరిగా లేవని, మళ్లీ భూమి పంచుకుందామని ఆంజనేయులుతో అన్నాడు. ఇద్దరం మర్రిచెట్టు దగ్గర ఒక్కొక్కరికి రెండున్నర, చెరువు దగ్గర రెండున్నర చొప్పున తీసుకుందామని గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయించుకున్నారు.

సత్యనారాయణ చెప్పినట్లు భూమిని పంచారు. చెరువు దగ్గర ఉన్న బోరును కూడా ఇద్దరూ సమానంగా వాడుకోవాలని గ్రామపెద్దలు చెప్పారు. ఈ క్రమంలో బోరు మాత్రం నేను ఒక్కడినే వాడుకుంటా అని సత్యనారాయణ అన్నాడు. దీనికి అంజనేయులు ఒప్పుకోకపోవడంతో వివాదం మొదలైంది. రోజులాగే బుధవారం ఉదయం నారుమడికి నీరు పెట్టేందుకు ఆంజనేయులు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సత్యనారాయణ మరో వ్యక్తితో కలిసి ఆంజనేయులుపై దాడి చేసి తలపై కొట్టాడు.



ఆంజనేయులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తీవ్ర గాయాలతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలని ఆందోళన

పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించేందుకు పోలీసులు ప్రయత్నించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, అప్పటి వరకు మృతదేహాన్ని తరలించేది లేదని బంధువులు అడ్డుకున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రామాయంపేట సీఐ లక్ష్మీబాబు , చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి, నిజాంపేట ఎస్ఐలు నారాయణ, హరీశ్‌గౌడ్, మొహినుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రెండు కార్లు చోరీ

పటాన్‌చెరు టౌన్: రెండు కార్లు చోరీకి గురైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీకి చెందిన ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి ఇంటి ఎదుట పార్కింగ్‌లో ఉంచిన ఫార్చునర్ కారు అద్దం పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన ఓం ప్రకాశ్ పోచమ్మ దేవస్థానం వద్ద పార్కింగ్ చేసిన ఇన్నోవా కారును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు ఇద్దరు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..

పటాన్‌చెరుటౌన్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని జీపీ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మీనారాయణ మంగళవారం ఉద్యోగానికి వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేసరికి తాళం పగుల గొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ.1.05 లక్షల నగదు, మూడు తులాల బంగారం కనిపించలేదు. ఇంట్లో చోరీ జరిగినట్లు డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాబు మృతి

కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండావాసుల ఆందోళన



కౌడిపల్లి సీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న కొత్తచెరువు తండావాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతోనే బాబు మృతి చెందాడని తండావాసులు ఆందోళన చేసిన ఘటన కౌడిపల్లి సీహెచ్‌సీలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండాకు చెందిన కాట్రోత్ కల్పనకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో డెలివరీ కోసం కౌడిపల్లి సీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. డాక్టర్, స్టాఫ్‌నర్స్ పలు పరీక్ష నిర్వహించారు. బుధవారం డెలివరీ సమస్య ఉందని వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు నార్మల్ డెలివరీ చేయగా పుట్టుకతోనే చనిపోయాడు. కౌడిపల్లి సీహెచ్‌సీ వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్లే బాబు మృతి చెందాడని కల్పన భర్త నర్సింగ్, అన్న గోపాల్, సర్పంచ్ భర్త దూద్యనాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధన్‌సింగ్, తండావాసులు సీహెచ్‌సీ వద్ద ఆందోళన చేశారు. వైద్యసిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తండావాసులకు నచ్చజెప్పారు. కల్పన డెలివరీకి ఇబ్బంది పడుతుంటే తాము వేరే ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పినా వైద్యులు పంపలేదని తండావాసులు ఆరోపించారు.

రెఫర్ చేసినా తీసుకెళ్లలేదు

కల్పనకు పురిటి నొప్పులు రావడంతో చికిత్స చేశామని డాక్టర్ ప్రవీణ్, స్టాఫ్‌నర్స్ తెలిపారు. ఆదే రోజు మెదక్ రెఫర్ చేశామన్నారు. అయినా తీసుకెళ్లకుండా ఇక్కడే డెలివరీ చేయాలని చెప్పారని వివరించారు. బుధవారం ఉదయం 108కు తామే ఫోన్ చేసి మెదక్ ఆస్పత్రికి పంపించామన్నారు. వైద్యం చేయడంలో తమ నిర్లక్ష్యం లేదని పేర్కొన్నారు.

చెరకు జాగ్రత్తలు మరవకు

- పంట వేసినప్పటి నుంచి తప్పనిసరి
- పక్వానికి రాకముందే క్రషింగ్‌కు తరలించొద్దు
- చక్కెర ఉత్పత్తి తగ్గడమే కాకుండా నష్టాలు
- సూచనలు పాటించాలంటున్న శాస్త్రవేత్తలు



శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): చెరకు సాగులో ఆధునిక సాంకేతికత దినదినాభివృద్ధి చెందుతుండటంతో ముమ్ముందు ఈ పంట భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తోంది. కానీ పంటలు వేసినప్పటి నుంచి చేతికందే వరకు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. సరైన పద్ధతులు పాటించకుండా పాత పద్ధతులను పాటిస్తే నష్టపోతారు. కొంత మంది రైతులు చెరకు పక్వానికి రాకముందే క్రషింగ్‌కు తరలిస్తూ ఉంటారు. దీంతో చక్కెర ఉత్పత్తి తగ్గడమే కాకుండా సరాసరి చక్కెర ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. చెరకు పంట పక్వానికి వచ్చిందా ?లేదా? కొన్ని లకువలు పాటించాలి. ప్రస్తుతం చేతికొచ్చిన చెరకు పంటను నరకుటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బసంత్‌పూర్–మామిడ్గి గ్రామాల శివారులో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎం.విజయ్‌కుమార్ మాటల్లోనే..



బసంత్‌పూర్‌లో చెరుకు నరుకుతున్న యంత్రం

పక్వానికి వచ్చిందా.. లేదా?

- పక్వానికి వచ్చిన చెరకు తోటల ఆకులు పచ్చ రంగులోంచి పసుపు రంగులోకి మారుతాయి.
- చెరకులో కొత్తగా మొవ్వుటాకులు రావడం ఆగిపోతాయి.
- గడలు లావై అక్కడక్కడ చిరు పగుళ్లు ఏర్పడి కన్నులు బాగా ఉబ్బినట్లు అవుతాయి. తోటలో కొత్తగా మొవ్వటాకులు రావడం ఆగిపోతాయి.



- చిట్ట చివర నాలుగైదు కణుపులు దగ్గర దగ్గర ఏర్పడి వాటి నుంచి పుట్టు ఆకులు ఒకే చోట కుచ్చువలె ఏర్పడుతాయి.
- కొన్ని రకాల్లో పూత పూయడం కనబడుతుంది. శాస్త్రీయంగా గమనిస్తే చెరకును రెండు భాగాలు నరికి వాటి రసంను వేర్వేరుగా గానుగాడిస్తే వాటిలోని ఘన పదార్థాలు సమానంగా ఉండాలి.
- చేతి రిఫ్రాక్టో మీటర్ ద్వారా కూడా చెరకు పక్వానికి వచ్చింది తెలుసుకోవచ్చు.
- వాతావరణ పరిస్థితులపై కూడా ఆధారపడి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చీడ పీడలు ఆశించిన చెరకును ముందుగా క్రషింగ్‌కు తరలించాలి. లేదా బెల్లం తయారీకి వాడాలి.
- ఆలస్యం చేస్తే దిగుబడులతో రసం నాణ్యత తగ్గుతుంది. బెల్లం తయారు చేశాక మెత్తగా ఉంటే నిల్వకు పనిరాదు.
- ఏదైనా ప్రమాదశాత్తు చెరకు కాలిపోతే ముందుగా దాన్ని నరికివేయాలి . లేకపోతే తూకం తగ్గి రోజుకు 3 శాతం చొప్పున తగ్గుతుంది.
- పూత వచ్చిన, బెండు బారిన చెరకును నరకడం ఆలస్యం చేయరాదు. పూత వచ్చిన చెరకు గడల్లో చివరి ఆరు కండాలు తీసేసి మిగిలిన చెరకును ఫ్యాక్టరీకి తరలించాలి.
- చెరకును భూ మట్టానికి నరకాలి. రెండు మూడు అంగుళాలు వదిలి నరకడం వల్ల ఎకరానికి రెండు మూడు టన్నులు దిగుబడి తగ్గుతుంది.
- కింది భాగంలో పంచదార పాలు ఎక్కువగా ఉంటాయి. అంతే కాకుండా చెరకు వేర్లు భూమిలోకి చొచ్చుకొని పోయి బలమైన గాలులు వీచినా చెరకు ఒరిగిపోదు.
- చెరకు క్రషింగ్‌కు తరలించే ముందు చెత్త, ఎండుటాకులు, వేర్లు, మట్టి లేకుండా తరలించాలి. చెత్తా చెదారంతో తరలించడం వల్ల పంచదార దిగుబడిలో 10 శాతం నష్టం వాల్లుతుంది.
- నీటి ముంపునకు గురైన తోటల్లో గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు కణుపుల వద్ద వచ్చే వేర్లను తొలగించాలి.
- వేర్లను తీసేయకుండా చెరకును అలాగే క్రషింగ్‌కు తరలిస్తే 0.4 నుంచి 0.6 శాతం మేర పంచదార దిగుబడి తగ్గుతుంది.

నరికిన తర్వాత

- నరికిన చెరకును 24 గంటల్లో ఫ్యాక్టరీకి సరఫరా చేయాలి. ఆలస్యమైన కొద్ది చెరకు తూకంలో 2 నుంచి 4 శాతం, రసనాణ్యతలో ఒక శాతం తరుగుదల కనిపిస్తోంది.
- నరికిన చెరకు తొందరగా ఫ్యాక్టరీకి తరలించలేని పక్షంలో కట్టిన చెరకు మోపులను నీడలో పెట్టి వాటిపై చెత్తను కప్పి నీరు పలుచగా పోయాలి.
- రైతులు సాగు మొదలు పెట్టినప్పటి నుంచి చివరి వరకు ఇలాంటి మెలకువలు పాటిస్తేనే లాభాలు సాధిస్తారని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



చెరకు నరుకుతున్న కూలీ

విద్యుదాఘాతంతో రైతు మృతి



శ్రీహరి మృతదేహం

నిజాంపేట(మెదక్): విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన రాగుల శ్రీహరి (32) బుధవారం ఉదయం పొలం వద్ద వరి నారుమడికి నీరు పెట్టడానికి వెళ్లాడు. తన పొలంలో పైనే హైటేషన్ విద్యుత్ తీగల కిందికి ఉన్నాయి. అయితే, వరినారు మడిపై ఉన్న నీటిని కర్రతో తొలగించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కర్ర విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రమైన శ్రీహరి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య కల్యాణి, మూడేళ్ల బాబు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు ఎంపిక

కోహెడరూరల్(హుస్నాబాద్): గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌లో కోహెడ మండలంలోని పెరుకలగడ్డ వింజపల్లి ప్రధానోపాధ్యాయులు డి.రవివర్మ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి పావని పలువురు ఉపాధ్యాయులు రవివర్మను అభినందించారు. ఈనెల 22న హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సులో గణిత అంశాలను పవర్ పాయింట్ ప్రదర్శన చేయనున్నారు.